క్లుప్తంగా

అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు



భాకరాపేట : చిన్నగొట్టిగల్లులోని తిరుపతి గంగమ్మ, యడమవారిపల్లెలోని శ్రీకృష్ణ ప్రియ ద్రౌపదీ అమ్మవారి ఆలయాల్లో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. తిరుపతి గంగమ్మకు భక్తులు రాగి జావను నైవేద్యం పెట్టి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించుకున్నారు.

కమనీయం..కల్యాణం



కల్యాణోత్సం నిర్వహిస్తున్న అర్చకుడు

పాకాల : మండలంలోని మొబ్బినాయనపల్లెలో మహాభారత మహోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం నిర్వాహకులు మొబ్బినేని రఘుపతి దంపతుల ఆధ్వర్యంలో కమనీయంగా ద్రౌపదీదేవి కల్యాణం జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ క్రమంలోనే రాత్రి అమ్మవారి స్వయంవరం, కల్యాణోత్సవ ఘట్టాల నాటకం ప్రదర్శించారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

పాకాల : పార్టీలకు అతీతంగా మండలాభివృద్ధికి పనిచేద్దామని ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. ఆదివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ లోనాథం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గంజాయి వ్యాపారుల ఆటకట్టించాలని పోలీసులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వహించే అధికారులపై వేటు తప్పదని హెచ్చరించారు. డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ పీహెచ్‌సీని 30 పడకలుగా మార్చాలని విన్నవించారు. ఏఓ పుష్పావతి మాట్లాడుతూ రైతులందరూ ఈ–క్రాప్ బుక్ చేయాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు నంగా పద్మజారెడ్డి, ఎంపీడీఓ నాగేంద్రబాబు, తహసీల్దార్ నిత్యానంద బాబు, సీఐ రాజగోపాల్ పాల్గొన్నారు.

కనులపండువగా 'భోగ్ బండారో'

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం విద్యుత్‌నగర్ లోని హథీరాం బావాజీ ఆలయంలో రెండు రోజులు పాటు నిర్వహించిన భోగ్ బండారో ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బుక్యా శివానాయక్ ఆధ్వర్యంలో కనులపండువగా ఉత్సవాలను జరిపించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, కోలాటాలు, నామ సంకీర్తనం, నాట్య ప్రదర్శన వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తిని ఊరేగించారు. బుక్యా శివానాయక్ మాట్లాడుతూ శ్రీవారితో బావాజీకి స్నేహబంధం కలిసిన రోజని వెల్లడించారు. ఈ పర్వదినాన ఏటా భోగ్ బండారో ఉత్సవం జరుపుకోవడం ఆనవాయితీ అని వివరించారు. బావాజీ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్క బంజారా బిడ్డ కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు గుండాల నాయక్, అధ్యక్షుడు చలపతి నాయక్, ట్రెజరర్ హరిబాబు నాయక్, శివ నాయక్, కుసుమహరి, సామ్రాజ్ నాయక్, బాలాజీ, శీను నాయక్, ప్రభాకర్ నాయక్, కిషోర్ నాయక్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులపై కూటమి ప్రభుత్వం శీతకన్ను వేసింది. నిరుపేదల బతుకుల్లో చీకట్లు నింపేందుకు పన్నాగాలు పన్నుతోంది. ఓ పథకం ప్రకారం సర్కారు బడులను నిర్వీర్యం చేస్తోంది. అందులో భాగంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన కార్యాచరణను కాలరాస్తోంది. అద్భుత ఫలితాలు సాధించిన స్కూళ్లను అలసత్వం నీడన అణగదొక్కుతోంది. కార్పొరేట్‌ను తలదన్నేలా తయారైన పాఠశాలలను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోంది. ప్రభుత్వ విద్యావ్యవస్థను నీరుగారుస్తూ పరోక్షంగా ప్రైవేట్‌కు వత్తాసు పలుకుతోంది. ఉన్నతంగా ఎదుగుతామనే ఆశతో సర్కారు బడిలో చేరిన పిల్లల భవిష్యత్‌తో చెలగాటమాడుతోంది. మధ్యాహ్న భోజనంలో ప్రమాణాలను గాలికి వదిలేసి విద్యార్థుల కడుపుగొడుతోంది. పాఠ్యాంశాల బోధనకు సరిపడా ఉపాధ్యాయులను నియమించకుండా అన్యాయం చేస్తోంది. గతంలో ఉజ్వలంగా వెలుగొందిన సర్కారు బడులను కుట్రపూరితంగా వెనుబడేలా చేస్తోంది.

వెనుకబడి



- ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన ప్రమాణాలు
- సర్కారు అలసత్వంతో విద్యార్థుల అవస్థలు
- నాణ్యత లేని మధ్యాహ్న భోజనం తినలేక పిల్లల ఇబ్బందులు
- పలు స్కూళ్లను వేధిస్తున్న ఉపాధ్యాయ సమస్యలు

తిరుపతి ఎడ్యుకేషన్/ తిరుపతి రూరల్: తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాల పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఓ వెలుగు వెలిగిన విద్యారంగం.. ప్రస్తుత పాలకుల వ్యవహారశైలితో చతికిలపడింది. గతంలో పిల్లలకు నిత్యం మెనూ ప్రకారం రుచికరంగా, నాణ్యమైన మధ్యాహ్న భోజనం వడ్డించేవారు. అయితే ఇప్పుడు మెనూ లెక్క తప్పింది. నాసిరకమైన ఆహారమే విద్యార్థులకు అందుతోంది. ప్రస్తుతం కేంద్రం ప్రవేశపెట్టిన శుభధిన్ భోజన్ కార్యక్రమం కింద దాతలు అందించే మధ్యాహ్న భోజనంతో పిల్లలు సరిపెట్టుకునే పరిస్థితి వచ్చింది. ఈ క్రమంలో విద్యార్థులు సైతం గతంలో హాయిగా.. తృప్తిగా భుజించిన 'జగనన్న గోరుముద్ద'ను గుర్తుచేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అని పేరుమార్చి తమకు నాణ్యతలేని ఆహారం అందిస్తోందని ఆవేదన చెందుతున్నారు. నాణ్యతలేని భోజనం చేయలేక ఒక్క తిరుపతి నియోజకవర్గంలోనే సుమారు 1,500 మంది విద్యార్థులు కడుపు మాడ్చుకుంటున్నట్లు అధికారి నివేదికలే వెల్లడిస్తుండడం గమనార్హం.

ఉపాధ్యాయుల కొరత

తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లోని పలు పాఠశాలలను ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది.

తిరుపతి నియోజకవర్గం

పాఠశాలలు	సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	46	3,543
ప్రాథమికోన్నత	11	1,422
ఉన్నత	21	7,180
మొత్తం	78	12,145

విద్యార్థుల సంఖ్యకు తగినట్టు టీచర్లను నియమించకపోవడంతో పిల్లలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

- తిరుపతిలోని ఎంజీఎం నగరపాలక ఉన్నత పాఠశాలలో టీచర్ పోస్టులు 4 ఖాళీగా ఉన్నాయి.

తిరుపతి నియోజకవర్గం

పాఠశాలలు	సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	287	12,341
ప్రాథమికోన్నత	11	472
ఉన్నత	46	3,472
కస్తూర్బా విద్యాలయం	01	683
మోడల్ స్కూల్	01	372
మొత్తం	346	17,340

ముత్యాలరెడ్డిపల్లె జెడ్పీ హైస్కూల్లో ఒకటి, తంబువానిగుంట నగరపాలక ప్రాథమిక పాఠశాలలో 4, కొర్లగుంట నగరపాలక ప్రాథమిక పాఠశాలలో 4, సంజయ్‌గాంధీకాలనీ నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాలలో 3 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే ఇటీవల 20 మందికి పైగా ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేయడంతో ఆ స్థానాలను భర్తీ చేయాల్సిన అవసరముంది.

- చంద్రగిరికి సంబంధించి కూడా చాలా పాఠశాలల్లో అవసరాలకు తగినట్టు ఉపాధ్యాయులు లేరు. ఇటీవల కొందరు టీచర్లు ఉద్యోగ విరమణ చేయడంతో ఆయా స్థానాల్లో ఎవరినీ నియమించలేదు. అలాగే బదిలీపై వచ్చిన 12 మంది టీచర్లను జాయిన్ కానివ్వకుండా స్థానిక టీడీపీ నేతలు అడ్డుకోవడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

సక్రమంగా అందని 'కానుక'

గతంలో పాఠశాల ప్రారంభమైన తొలిరోజే పిల్లలకు విద్యాకానుక కిట్‌లను ప్రభుత్వం అందించేది. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్సులు, బూట్లు, సాక్సులు, యూనిఫామ్ తదితర సామగ్రిని వెంటనే పంపిణీ చేసేది. అయితే ఈ ఏడాది కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పాఠశాలలు మొదలయ్యాయి. అయితే అప్పటికే గత వైఎస్సార్‌సీపీ సర్కారు ముందస్తుగా పిల్లలకు అవసరమైన విద్యాకానుక కిట్‌లను సిద్ధం చేసి ఆయాన స్కూళ్లకు చేరవేసింది. తయారుగా ఉన్న కిట్‌లను సైతం కూటమి ప్రభుత్వం సక్రమంగా పంపిణీ చేయలేక చేతులెత్తేసింది.

- తిరుపతి నియోజకవర్గంలో విద్యార్థులందరికీ పేరు మాత్రమే కిట్‌లు అందించారు. పలుచోట్ల పాఠ్యపుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, యూనిఫామ్ ఇవ్వలేదు. కొందరికి బూట్లు, సాక్సులు అందలేదు. అలాగే ఇంటర్ విద్యార్థులకు రెండు రోజుల క్రితం పాఠ్యపుస్తకాలు సరఫరా చేసి చేతులుదులుపుకున్నారు. ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకైతే ఇప్పటికీ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదు.
- చంద్రగిరికి సంబంధించి సుమారు 300 మంది పదోతరగతి విద్యార్థులకు ఇప్పటికీ విద్యాసామగ్రిని అందించలేదు. సకాలంలో పుస్తకాలు ఇవ్వకపోవడంతో పిల్లలు చదువుకునేందుకు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు.

జాయింట్ సెక్రటరీకి సత్కారం



ముత్తువేల్‌ను సన్మానిస్తున్న నారాయణగౌడ్

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఆరోగ్య కేంద్రంలో సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న ముత్తువేల్ నాన్ టీచింగ్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఆదివారం రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు డాక్టర్ పర్యారు నారాయణ గౌడ్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ అలేఖ్య, డాక్టర్ భరణి, అలీ, శ్రీనివాసులు, పవన్, నాగార్జున పాల్గొన్నారు.

ఘనంగా దినేష్ కల్పన హాస్పిటల్స్ వార్షికోత్సవం



తిరుపతి కల్చరల్: భవానీనగర్‌లోని శ్రీదినేష్‌కల్పన హాస్పిటల్స్ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ దినేష్‌కుమార్ దొడ్ల, డాక్టర్ కల్పన, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టి కృషితో మండల అభివృద్ధి

భాకరాపేట : సమష్టి కృషితోనే మండల అభివృద్ధి సాధ్యమని ఎర్రావారిపాళెం ఎంపీపీ రెడ్డెమ్మ తెలిపారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లింగ్ కట్టడికి అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం శాఖలవారీగా సమీక్షించారు. సమావేశంలో ఎంపీడీవో మధుసూదన్ రావు, ఆర్‌ఐ జానకిరామ్, వ్యవసాయాధికారి ఖాదర్ బాషా, ఎంఈఓ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లు



చంద్రగిరి తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది



పాకాల తహసీల్దార్ నిత్యానందబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది



భాగ్యలక్ష్మి, తిరుపతి అర్బన్ తహసీల్దార్

తిరుపతి అర్బన్ : తిరుపతి అర్బన్ తహసీల్దార్‌గా కేపీ భాగ్యలక్ష్మి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రధానం భూ సమస్యల పరిష్కారంపై శ్రద్ధ వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో డీటీ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి : చంద్రగిరి మండల తహసీల్దార్‌గా శివరామ సుబ్బయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు రెవెన్యూ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన తొలిప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీటీలు అమృత, యుగంధర్, ఏఎస్ఓ స్వర్ణలత, సిబ్బంది వినోద్, ఉషారాణి, వీఆర్‌ఓల సంఘం నాయకులు వెంకన్న, మునస్వామి, వాసయ్య, భాస్కర్, విష్ణు, సుబ్రమణ్యం నాయుడు పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల : మండల తహసీల్దార్‌గా నిత్యానందంబాబు బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్ నుంచి ఉద్యోగోన్నతిపై ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. తహసీల్దార్‌కు డీటీలు మోహన్, పరదేశి, సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం: మండల తహసీల్దార్‌గా వెంకటరమణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆయనను సత్కరించారు. డీటీ పునీతారాణి, సర్వేయర్ హేమకుమార్, ఆర్‌ఐ కృష్ణమ్మ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, వీఆర్‌ఓలు ప్రసాద్, వెంకన్న, విజయ్ భాస్కర్, వీఆర్‌ఏలు గోవిందస్వామి, బాలు, మోహన్‌బాబు, గంగయ్య, సురేంద్ర, మంజుల పాల్గొన్నారు.



రామచంద్రాపురం తహసీల్దార్ వెంకటరమణను సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పార్థివ శివలింగాలకు విశేష పూజ

తిరుపతి కల్చరల్ : టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మురం శెట్టి రాములు ఆధ్వర్యంలో పార్థివ (మట్టి) శివలింగాలకు ఆదివారం కపిలతీర్థం రోడ్డులోని శ్రీవారి సన్నిధిలో విశేష పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి టీజీ.వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై పార్థివ శివలింగాలకు పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో కాశీ క్షేత్రంలో వైభవ ప్రవచన యజ్ఞం, శివపదగానోత్సవం, కోటి పార్థివ శివ లింగార్చన కార్యక్రమం జరగనుంది. అందులో భాగంగా మురం శెట్టి రాములు తిరుపతి, సిద్దిపేట నుంచి ప్రత్యేకంగా అత్యంత భక్తి భావంతో తయారు చేసిన 7 లక్షల పార్థివ శివలింగాలను తిరుపతిలోని శ్రీవారిని సన్నిధికి తీసుకొచ్చి భక్తజనం మధ్య పూజలు నిర్వహించారు. అనంతరం శివలింగాలతో కాశీ యాత్ర చేపట్టారు.



పూజలకు నిర్వహిస్తున్న టీజీ.వెంకటేష్, మురం శెట్టి రాములు

జరగని వేలం.. రూ.లక్షల నష్టం

చంద్రగిరి : నియోజకవర్గంలోనే చంద్రగిరి వారపు సంత అతి పెద్దది. ప్రతి ఆదివారం జిల్లా వ్యాప్తంగా భారీ సంఖ్యలో వర్తకులు సంతకు వచ్చి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. మండల వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ప్రజలు సంతకు వచ్చినిత్యవసరాలు కొనుగోలు చేస్తుంటారు. అయితే సంత నిర్వహణకు వేలం పాటను ఏటా పంచాయతీ అధికారులు నిర్వహిస్తుంటారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు వారపు సంతతో పాటు కసాయి మార్కెట్, పార్కింగ్, పంచాయతీ కాంప్లెక్స్‌ల వేలం పాటకు అధికారులు సమాయత్తమయ్యారు. ఇంతలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో తాత్కాలికంగా వేలం పాటకు బ్రేక్ పడింది. అయితే ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యి నెలలు గడుస్తున్నా వేలం పాట నిర్వహించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఒక్క వారపు సంత ద్వారానే పంచాయతీకి సుమారు రూ.20లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. దీంతో పాటు పార్కింగ్, కసాయి మార్కెట్, పంచాయతీ కాంప్లెక్స్ అద్దెలతో కలిపి ప్రతి ఏడాది సుమారు రూ.40లక్షలకు పైగా ఆదాయం వస్తోంది.

నామమాత్రంగా ఆదాయం

వారపు సంత, కసాయి మార్కెట్, పార్కింగ్, పంచాయతీ కాంప్లెక్స్‌లోని దుకాణాల వేలం పాట నిర్వహణకు అధికారులు జాప్యం చేస్తుండటంతో పంచాయతీ ఆదాయానికి నష్టం వాటిల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదాయం ఆర్జించే వనరులకు వేలం పాటు నిర్వహించకుండా ఎందుకు మౌనంగా ఉన్నారంటూ ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ అధికారులకు వ్యాపారులు సక్రమంగా రుసుము చెల్లించకపోవడంతో నామమాత్రంగా వసూలవుతోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వారపు సంతకు వేలం పాట నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.



చంద్రగిరి వారపు సంత

పొంచి ఉన్న ప్రమాదం

నగరంలోని ఇస్కాన్ టెంపుల్ సమీపంలోని నాగాలమ్మ ఆలయం వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఇక్కడ నాగాలమ్మ పుట్ట చుట్టూ కాలువ ఉండడంతో మహిళలు గట్టుపై ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. దీంతో చాలామంది కాలువలో జారి పడి గాయాలపాలవుతున్నారు. త్వరలోనే నాగులచవితి పండుగ రానున్న నేపథ్యంలో అధికారులు స్పందించి, కాలువపై బండలు వేయించాలని భక్తులు కోరుతున్నారు.

- తిరుపతి కల్చరల్











అ'పూర్వ'ం.. ఆత్మీయం

తిరుపతిలోని శ్రీపండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ 1983-84 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవం జరుపుకున్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక కార్యక్రమంలో సుమారు వందమంది కలుసుకున్నారు. నాటి మధుర స్మృతులను నెమరువేసుని మురిసిపోయారు. ఉన్నతంగా రాణిస్తున్న తమ ఆత్మీయ నేస్తాలతో కబుర్లు చెప్పుకుని సంతోషపడ్డారు. కార్యక్రమంలో కె.లోకేష్ వర్మ, కందారపు మురళి, పగడాల అర్జున్, ట్రెక్కింగ్ బాలు, ఆర్‌ఆర్ శ్రీనివాస్,, కె. సురేంద్ర, ముని, డాక్టర్ రామ్‌కుమార్, శ్రీనివాసులు, కిషోర్, రమేష్, షఫీ, అలీఖాన్, సుబ్రమణ్యం, బాలకృష్ణ, కందారపు సురేంద్ర, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే తిరుపతిలోని టీపీపీఎం హైస్కూల్ 1981-82 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సైతం తాము విద్యాభ్యాసం చేసిన పాఠశాలలో కలుసుకున్నారు. నాలుగు దశాబ్దాల అనంతరం ఒకరినొకరిని చూసుని భావోద్వేగానికి గురయ్యారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందించారు. కార్యక్రమంలో డి.రామకృష్ణారెడ్డి, వీజేడీ.సుకుమార్, బి.శ్రీనివాసులు, రమణ, బి.వెంకటరమణబాబు, బి.ఆదినారాయణరెడ్డి, ఎం.బాబు, డి.శ్రీనివాసులురెడ్డి, ఆర్.హరికుమార్ పాల్గొన్నారు. ఈ క్రమంలోనే రామచంద్రాపురం మండలం కేకేవీపురం జెడ్పీ ఉన్నత పాఠశాల 2006-07 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించుకున్నారు. తమ ఉన్నతికి కారణమైన స్కూల్ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలని సంకల్పించారు.

- తిరుపతి తుడా/ తిరుపతి కల్చరల్/ రామచంద్రాపురం